# ఇంకానా...

- అత్తలూరి నరసింహారావు

అప్పుడే వీధి దీపాలు వెలిగాయి. అప్పటివరకు పొలాలు దున్ని ఎద్దులు చావిళ్ళకు చేరుకోవటానికి వీధుల్లోనుండి పోతున్నాయి. వాటి వెనకాల పెద్ద జీతగాళ్ళు ములుగర్రలు భుజానపెట్టుకుని ఎద్దుల్ని అదిలిస్తూ కబుర్లు చెప్పుకుంటూ పోతున్నారు. పొలాల్లో వరినాట్లువేసే తరుణం. పెద్ద ఆసాములంతా ముందే దుక్కి దున్నించుకుంటున్నారు. ఆఊరి పొలం అంతా దాదాపు దుక్కిదున్నటం అయిపోయింది. ఇంకా కొదవ వున్నవాళ్ళు, చిన్నకారు రైతులు కూడ దున్నటం ముగించేసుకుంటున్నారు. నీటి వసతి బాగావుండటంవల్ల కాలవలో నీళ్ల ముందుగానే వదుల్తారనే వినికిడివల్ల పెద్ద భూస్వాములు, చిన్నరైతులు అందరు అదునుగా నారుమళ్ళ మంములుకొట్టి మరీపెంచుకున్నారు. నారు ఏతకొచ్చి నవనవలాడుతుంది. పెద్దకాలవలో నీళ్ళు భర్తీగా పోతున్నాయి. ప్రక్కనున్న చినకాలవల్లోకి, తూముల్లోకి పూటుగా నీళ్ల వదిలేశారు. ఎవరికివారు చేలు తడుపుకుని ముందుగానే నాటేసుకుందామనే ఆతురతతో వున్నారు. దాంతో ఊళ్లొ జనం అంతా పొలాలమీదే ఎక్కువగా వుంటున్నారు. ఎవరికివారు పైచేను ఎప్పుడు తడుస్తుందా తమ చేలకి నీళ్ళు ఎప్పుడు పెట్టుకుందామా అనే ఆలోచనలో వున్నారు. కొందరు పైవాడిచేను తడవకుండానే ఆ చేనువాడు లేనప్పుడు అడ్డీ తెగదీసి తమచేలకి నీళ్ని మళ్ళించేసుకుంటారు, మళ్ళీ అపైచేనువాడు వచ్చి కిందిచేనుకి నీళ్ళు ఎక్కకుండా తనచేనుదగ్గర అడ్డీవేసుకుంటాడు. నాట్ల సమయంలో ఇలాంటి విషయాల్లో తగువులు రావటం, తలలు పగలటం, కోర్టులచుట్టూ ఆసుపత్రులచుట్టూ తిరగటం సర్వసాధారణం అయిపోయింది.

ఊళ్ళోవున్న దాదాపు మూడొంతుల పొలం మోతుబరి భూస్వాములు వెంకటాద్రినాయుడు, సూర్యనారాయణ చేతుల్లోవుంది. తతిమ్మావంతులో చిన్నకారురైతులు. మిగతా వాళ్ళంతా ఆ భూముల్లో కూలిపనులు చేసుకుంటూ కొందరు, భూస్వాముల ఇళ్ళల్లో జీతగాళ్ళుగా కొందరు, పెద్ద భూస్వాములు పదెకరాల చేలయితే చిన్నరైతులు చేనుపక్క గట్లు. వాళ్లగట్లు అయితే పీళ్లు గట్లమీది గడ్డిపరకలు. వెంకటాద్రినాయుడు మూడు పదులు నిండినవాడు. ఎర్రగా ఎత్తుగా దర్జాగావుంటాడు. రాజకీయాల్లో కొత్తగా ప్రవేశించి మొన్నజరిగిన పంచాయతీ ఎన్నికల్లో తనవార్డులో గెలిచి సర్పంచికి

పోటీచేసి ఒక్క ఓటుతో ఓడిపోయాడు దాంతో అనాదిగావస్తున్న సూర్యనారాయణే సర్పంచిగా ఎన్నికయ్యాడు. మొత్తానికి సూర్యనారాయణకి గట్టిపోటీనే ఇచ్చాడని నాయుడిని అందరూ అనుకున్నారు. సూర్యనారాయణ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని రాష్ట్ర రాజకీయాల్లో ఒకవెలుగు వెలిగి ఇప్పుడు స్థానిక రాజకీయాల్లో సమితిలెవెల్లో ఆరిపోతున్న దీపంలా వెలుగుతున్నాడు. ఆయనకు మిగిలింది ఏభై ఎకరాల మాగాణి భూమి. ఒకేప్లాట్. ఈ చివర్నుంచి చూస్తే ఆ చివరి చేనుగట్టు కనపడదు. నాయుడుకి ఈ ఏభై ఎకరాల ప్లాటు పక్కనే పాతికెకరాలు ఒకటే చేనుంది. ఇంకా ఊరు చుట్టూ పదెకరాల చొప్పున పదిచోట్ల పరుచుకునుంది. ఆర్థికంగా నాయుడు, రాజకీయంగా సూర్యనారాయణ ఆ ఊరు ముకుదాళ్ళని చేతుల్లో పెట్టుకున్నారు. పంచాయతీ ఎన్నికల నుండి వీరిద్దరు రాజకీయ శిబిరాల్ని నిర్వహిస్తూ బలంగావున్నారు. వీరిబలం బలపడటానికి ఉక్కువలలు విసిరి కూర్చున్నారు. వీరిపుణ్యమా అని ఇళ్ళలోవున్న బరిసెలు, కర్రలు, కత్తులు అటకలమీదనుంచి దిగి అప్పుడప్పుడు బాకునాట్యం చేస్తుంటాయి.

సూర్యనారాయణ అప్పుడే భోంచేసి చుట్టపుగాకు పాయిలు తీసుకుంటూ వచ్చి వరండాలో మంచంమీద కూర్చున్నాడు. అప్పుడే ముత్తడువచ్చి పంపుదగ్గర కెళ్ళి ముఖం కాళ్లు కడుక్కుని పైపంచతో ముఖం తుడుచుకుంటూ సూర్యనారాయణ కూర్చున్న చోటికివచ్చాడు. "ఏరా నీళ్ళెక్కుతున్నాయా బాగా" అని చుట్టనోట్లోపెట్టుకుని అగ్గిపుల్ల గీసి వెలిగించుకున్నాడు. పైపంచ తీసుకుని కిందపేసుకుని కూర్చుని "దక్షిణవేవు మడి ఈ రేత్తిరికవుద్ది. నీళ్లు తెగతాగుతుండాది. ఎంకటాద్రియ్యాగారి మడుసులు అడ్డీతెగతీపోతే ఈపాటికయ్యేదే. ఈ రేత్తిరికి నాలుగైదుసార్లన్నా ఎల్లి సూసిరావాల. లేపోతే ఈరిగాడు తెగతీటం కాయం అన్నాడు ముత్తడు. "ఆ– ఆ– అదేదో కాస్త అవజెయ్యి. నారు ముదిరిపోతుందేమో మళ్ళీ. ఆ లమ్డికొడుకుతో చెప్పు ఈసారి అడ్డీ తెగదీస్తే మక్కెలిరగ దంతానని. నాయుడ్ని చూసుకుని ఈ వెధవ జోరెక్కువయినట్టుంది. లంజకొడుకుని ఈసారితీస్తే తన్ను పట్టుకుని ఎవడడ్డమొస్తాడో" అని నుసిరాల్చి చుట్ట నోట్లోపెట్టుకుని గుప్పుగుప్పున పొగలాగుతున్నాడు. "అమ్మగోరూ అబాట్రీలైటివ్వండి పోతాను. మళ్ళీ చీకటిలో పడిపోవాల. మద్దేల తిన్నకూడు అకలిగావుంది" అని లేచి పైపంచ దులుపుకుని భుజానేసుకునేసరికి నాయుడు భార్య టార్చిలైటు తీసుకొచ్చి అందించింది. దాన్ని అందుకుంటూ "కాస్త పచ్చడుంటే పెట్టండమ్మగోరు. ముసల్ది రోజూ పోరు పెడతావుంది" అన్నాడు. "ముసల్దానికి ఒల్లు బాగయిందట్రా" సూర్యనారాయణ చుట్టపారేసి అన్నాడు. "కాస్త తెరిపిగానే వుండాదిలెండి, లెగిసి తిరుగుతుండాది"

742

అన్నాడు. బాదం ఆకులో పెట్టుకుని తెచ్చిన పచ్చడిని చేతుల్లోకి అందుకుని "వస్తానం డమ్మగోరు" అని వరండాదాటి బయటకు నడిచాడు. "రేయ్! ఈరాత్రికి కావాలంటే అక్కడేవుండి ఎలాగయినా సరే చేను తడిసేటట్టు చూడు ఎవరన్నా వాస్తే ఒక్క చుక్క కూడ నీరు వదిలేది లేదనిచెప్పు. ఇదో— ఆ టార్చిలైటు జాగ్రత్త" అని మంచం మీదనుండి లేచి ఇంట్లోకి దోపతీసాడు సూర్యనారాయణ. "అట్టాగే—అట్టాగే" అంటూ ముత్తడు వెళ్లిపోయాడు. సూర్యనారాయణ భార్య తలుపుగెడవేసి ఇంట్లోకివెళ్లింది.

గూడెంలో అక్కడక్కడ కొన్ని వీధి దీపాలు వెలుగుతున్నాయి గుడిశల మధ్యగా దబ్బపండు శరీరం ఒకటి వేగంగా కదిలిపోతూవుంది? ఎక్కడి వారక్కడ దక్కి మంచాల మీద, చాపలమీద, మట్టి అరుగుల మీదపడి నిద్రపోతున్నాడు. అప్పు డప్పుడు ఉన్నట్టుండి కుక్క అరుస్తుంది. అక్కడక్కడ నిద్రపట్టనివాళ్లు వీధిలోపోయే మనిషిని చూసి, మళ్ళీ కళ్లమూసుకుంటూ తెరుచుకుంటూ పడుకున్నారు. ఆ మనిషికి ముత్తడు కర్రతీసుకునిపోతూ ఎదురయ్యాడు. ముత్తడు నీళ్లపెట్టిన చేనుకి దోవతీసాడు. ఆ మనిషి నేరుగా గోడలు ఇటికరాయితో కట్టి పైన రెల్లుగడ్డి కప్పిన ఇంటిముందుకు వెళ్లాడు. ముందు వరండాలో ముసుగుదీసుకు పడుకున్న ముసిల్ది అలికిడివిని తలెత్తిచూసి మళ్ల తలదించుకుని పడుకుంది అది మారితల్లి ఆమనిషి తలుపు నెమ్మదిగాతోసాడు. ఆ ఇల్లు కట్టించింది ఆ మనిషేనని ఆ ఊళ్లో చాలావుందంటారు. తలుపు తెరుచుకున్న మేరకు లోపల లాంతరు కాంతి బయటకు పరుచుకుంది ఆ మనిషి లోపలకు వెళ్ళి తలుపు మూసేసరికి కాంతి మూసుకుంది పాతనవ్వారు మంచంమీద పడుకున్న శరీరం తాలూకు స్తనాలమీద చెయ్యివేశాడు వెచ్చగా. ఉలిక్కిపడిన మారి మనిషిని చూసి, కళ్లనలుపుకుంటూ "ఇంతపొద్దోయొచ్చావే" అంది ఆమనిషి మంచంమీద కూర్చుంటూ "ఊరిగాడెళ్ళి ఎంతసేపయింది" అన్నాడు. మారి కాస్తపక్కకు జరుగుతూ "సందేళే, దీపాలెట్టేసరికి నాలుగు మెతుకుల్తిని బరిసుచ్చుకుని పొన్నుకర్రతో బయలెల్లాడు. అడిగితే 'ఏంల్లేదులేయే' అంటూ పోయాడు" అని చెప్పింది. "నేనే పొమ్మన్నాలే పెందలాడే ఈ రాత్రికి ఏకాడికైనాసరే చేలు తడవాలని. చేలకి నీళ్లు పోనివ్వటం లేదు సరిగ్గా—నారేమో ఎక్కొస్తంది" అన్నాడు మారిలెగిసి తన తలదగ్గరున్న మాసికదిండు తీసి ఆ మనిషి తిన్నగా మంచంమీద జరిపింది మంచందిగి కిందపడుకున్న రెండేళ్ళ బుడతడికి చింకిపేలిక కప్పి. ఇత్తడిగ్లాసుతో కాసిన్ని మంచినీళ్లు తాగి, తలుపు గెడేసి, గోడమీద మేకుకు తగిలించిన లాంతరు దీపం ఒత్తిబాగా తగ్గించి మంచందగ్గర కొచ్చే సరికి ఆ మనిషి జరిగి పడుకున్నాడు. ఆ ఖాళీని మారి ఆక్రమించింది. నల్లగా నిగనిగ

743

లాడుతున్న జాకెట్టులేని శరీరానికి అంటుకున్న మాసిన తెల్లబాడీని ఉతికిన నలిగిన చీరను చేతులు పక్కకు తొలగించాయి.

*  *  *  *

సూర్యనారాయణ చేను ప్రక్కనున్న చినకాలవకి వేసిన అడ్డికి ఆ రాత్రికి నాలుగోసారి గండికొట్టి నాయుడి చేలోకి నీళ్ళు మళ్ళించి కాళ్లచేతులు కడుక్కున్నాడు ఈరిగాడు తడిసిన చేను ఒకసారి పారజూసి మరల గట్టెక్కి ఊరికి దూరంగా అడ్డ రోడ్డు దగ్గరున్న తాళ్ళచేనుకి నీళ్ళెలా ఎక్కుతుందీ, ఎవరన్నా గండికొట్టిందీ లేనిదీ చూసి రావటానికి రోడ్డెక్కాడు చేతిలోవున్న పొన్నుకర్రను బలంగా నేలకుతాటిస్తూ ఈరిగాడు ఒకసారి మొల్లోవున్న బరిశెను చేతితో తడిమి చూసుకున్నాడు.

ముత్తడు పెళ్లాన్ని నిద్రలేపి "చేనుదగ్గర కెళ్ళొస్తానొసే" అని టార్చిలైటు, కర్రి అందుకుని రోడ్డుపట్టాడు. ముత్తడి పెళ్లాం తూలుతూ నిద్రకళ్ళతో లేచి తడికేసి, గొళ్ళెం పెట్టి, రాయి అడ్డంపెట్టి పడుకుంది. ముత్తడు ఊరుదాటి చేతిలోవున్న టార్చి లైటు స్విచ్చిని రోడ్డువైపుకు అప్పుడప్పుడు చేత్తో నొక్కుతూ ఆలోచించుకుంటూ అడుగులు వేస్తున్నాడు. "ఈపాలికూడ ఈరిగాడు గండి కోట్టాడేమో" అని అనుమానంతో నడుస్తూ "ఈపాలయితే ఆడిపుచ్చ పుచ్చకాయలా పగిలిందే" అని ఒక నిశ్చయానికొచ్చి వేగంగానడుస్తూ చేనుదగ్గఃకు చేరాడు. చేలోకి నీళ్ల చుక్కెక్కటం లేదు. చేతులోవున్న టార్చిలైటు, కర్ర గట్టుమీదపెట్టి, పంచెగట్టుకుని నీళ్ళలోదిగి ప్రవాహానికి అడ్డీవేశాడు. తన దొరగారి చేలోకి నీళ్ళని మళ్ళించాడు. నీళ్ల చేలోకి దూకుతూ పోతున్నాయి. కాళ్ళు, చేతులు కడుక్కుని గట్టెక్కి చేనువంక చూస్తూ "ఈడుండే ఈడిపని బట్టాల" అనుకుని టార్చి. కర్రి చేతిలోకి తీసుకుని. కొద్దిదూరం వెళ్ళి ఎండి పోయి పగుళ్ళిచ్చిన బోదెలోకి టార్చివేసి 'పరవాలేదు' అనుకుని బోదెలోకి దిగి కూర్చుని మెడఎత్తి అడ్డీవేపుకే చూస్తూ కూర్చున్నాడు.

ఊరు చుట్టూవున్న నాయుడి పొలాల్లోకి నీళ్ల ఎక్కేదీ లేనిదీచూస్తూ, అవసరంగా వుంటే పై చేనువాడి కెక్కకుండా గండికొట్టి దొరగారి చేను తిన్నగా అడ్డీలు వేస్తూ మళ్లీ పాతికెకరాల చేనుదగ్గరకు చూడటానికి వచ్చాడు ఈరిగాడు. చూసేసరికి చేలోకి నీళ్ల చుక్కెక్కటం లేదు పైకివెళ్ళి సూర్యనారాయణ చేను తిన్నగా అడ్డీవేసి వుండటం, ప్రవాహంలాగ నీళ్లపోవటం చూశాడు. "లంజకొడుకు ముత్తడేసుంటడు"

744

అనుకుని నీళ్ళలోకి దిగి అడ్డీపగలకొట్టాడు. వెంటనే నాయుడి చేలోకి ఉరకటం మొదలెట్టాయి. ఇదంతా దూరంగావుండి గమనిస్తున్న ముత్తడు ముచ్చెమటల్తో పరుగెట్టుకుంటూ పచ్చి ఈరిగాడ్ని కర్రితో నడుమ్మీద బలంగా ఒకటిచ్చి "లంజకొడక– లంజకొడక– ఎన్నిసార్లులా గండికొట్టేది. పెళ్లాన్ని మళ్లించుకోలేనివెదవ్వి నీళ్ళని మళ్ళించటాని కొచ్చావట్రా తొత్తుకొడకా" అంటూ తిట్లు, బూతులు ఆరంభించాడు. తిక్కరేగిన ఈరిగాడు "నీకివ్వాళ మూడిందిరా" అంటూ చేతిలోవున్న పొన్నుకర్రతో ముత్తడి తలమీద సమ్మెటలా ఖలంగా నాలుగుసార్లు కొట్టాడు. "అమ్మో– అయ్యోయ్– అమ్మో–అయ్యో– చచ్చాన్రోయ్" అంటూ ముత్తడు తలబడుతూ పడిపోయాడు. అయిదోసారి ఎత్తిన ఈరిగాడి చెయ్యి ముత్తడి తలనెత్తురు చిమ్మటం చూసి ఆగిపోయింది. ముత్తడి కంపిత, రక్తసిక్తశరీరం గట్టుమీద విలవిల కొట్టుకుంటుంది. వేగంగా కొట్టుకుంటున్న గుండెల్నదిమిపట్టి పొన్నుకర్రి చివర రక్తం మరకల్తో ఈరిగాడు చీకటిలోకి దూసుకుంటూ పోయాడు.

* * * *

తెల్లవారింది –

ముత్తడి పెళ్ళాం ముండమోసింది.

వారం రోజులయింది –

నాయుడింట్లో జీతానికి సూరిగాడు కుదిరాడు.

నాలుగు నెలలు జరిగాయి –

మారి మాంచి పనసపండులాంటి పిల్లాడ్ని కన్నది.

ఆరునెలలు గడిచాయి –

ఆసాములకు పండిన పంట బస్తాలతో బళ్ళమీద ఇంటికొచ్చి చేరింది.

"అఖ్యా అఖ్యా బాగానేవుండారు – మధ్య పోయేకాలం మన కేమొచ్చిందంట?"

అని గూడెంలో అగ్గి అంటుకుంది.

మనిషి శుద్ధవెర్రికుట్టె ఒక పిపీలికాన్ని సృష్టించడం తనచేత కాక పోయినా డజన్లకొద్దీ దేవుళ్లని మాత్రం పుంఖాను పుంఖాలుగా తయారు చేస్తున్నాడు.

—మాంటెన్.